**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**ప్రచురణార్థం/ప్రసారార్థం :**

విజయవాడ,
తేది : 6.12.2019.

## రాజధానిపై స్పష్టమైన విధానం ప్రకటించి కేంద్రం నుండి నిధులు సాధించాలి.

రాజధాని నిర్మాణంపై చిత్తశుద్ధి లేకుండా అధికార/ప్రతిపక్ష పార్టీలు పరస్పరం నిందించుకుంటూ రాష్ట్రాభివృద్ధి, రాజధాని అభివృద్ధి అంశాలను పక్కదారి పట్టించడాన్ని సిపిఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఖండిస్తున్నది. పరస్పర విమర్శలు, నిందారోపణలు మానుకుని ఉమ్మడిగా రాజధానికి, రాష్ట్రాభివృద్ధికి రావల్సిన నిధులపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సిపిఐ(ఎం) కోరుతున్నది.

2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ రాజధాని నిర్మాణం పేరుతో వేలాది ఎకరాలు సమీకరించడంపై ఆనాడే అనేక విమర్శలు వచ్చాయి. దళితులు, పేదలు, చిన్న రైతులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు. ఉపాధి కోల్పోయారు. చట్టబద్ధమైన హామీలు అమలు కాలేదు. తాత్కాలిక భవనాల పేరుతో వేల కోట్లు ఖర్చు పెట్టింది. ప్రపంచ స్థాయి రాజధాని పేరు చెప్పి అభివృద్ధిని కేంద్రీకరించే విధానం చేపట్టింది. ఈ అంశాలపై ఒక్కసారి కూడా అఖిలపక్ష సమావేశం జరపలేదు.

వెనుకబడిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తూ అభివృద్ధి పేరుతో తెలుగుదేశం, బిజెపి ప్రభుత్వాలు చేపట్టిన కేంద్రీకరణ విధానాన్ని సిపిఐ(ఎం) మొదటి నుండి వ్యతిరేకిస్తూ వచ్చింది. పరిపాలనా రాజధాని నిర్మాణంతోపాటు ఉత్తరాంధ్ర, రాయలసీమ తదితర వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించి కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని సిపిఐ(ఎం) మొదటినుండీ డిమాండ్ చేస్తున్నది.

వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత రాజధాని నిర్మాణంపై స్పష్టమైన ప్రకటన చేయలేదు. పైగా మంత్రుల ప్రకటనలు ఈ ప్రాంత ప్రజలలో అపోహలు, అనుమానాలు కలిగిస్తూ గందరగోళం సృష్టిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణంపై స్పష్టమైన విధానం ప్రకటించి పరిపాలనా రాజధాని నిర్మించేందుకు తగు చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వ హయాంలో అవినీతి జరిగితే బయట పెట్టాలి. అలా కాకుండా పోటీ సదస్సులు, విమర్శలు చేసుకోవడం తగదు.

గత ప్రభుత్వ హయాంలో రాజధానిలో చేపట్టిన భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్)ను తప్పు అని విమర్శించిన వైసిపి నేడు అదే భూసమీకరణ విధానాన్ని రాష్ట్రం మొత్తం అమలు చేసే విధంగా 294 జివో విడుదల చేయడం శోచనీయం. గత టిడిపి ప్రభుత్వ హయాంలో రాజధానిలో దళితులకు ఇతరులతో సమానంగా కాకుండా తక్కువ ప్యాకేజినిచ్చి వివక్షత ప్రదర్శించగా దానిని సరిదిద్దుతామన్న వైసిపి నేటికీ సమాన ప్యాకేజి ప్రకటించలేదు. రాజధాని పేదల పెన్షన్‌ను రు.5వేలకు పెంచుతామన్న హామీని అమలు చేయలేదు. బలవంతపు భూసేకరణ నోటీసులు ఇప్పటికీ రద్దు చేయలేదు. చట్టబద్ధంగా దళితులు, కూలీలు, రైతుల కిచ్చిన హామీలు విస్మరించిన టిడిపి, వైసిపి పార్టీలు నేడు రాజకీయ ప్రయోజనాల కోసం వెంపర్లాడడం గర్హనీయం.

పిట్ట పోరు, పిట్టపోరు పిల్లి తీర్చినట్లు రాజధాని నిర్మాణానికి తగిన నిధులు కేటాయించకుండా రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపి చోద్యం చూస్తూ కూర్చున్నది. తెలుగు దేశం, వైసిపి పార్టీలు పరస్పర విమర్శలు, నిందారోపణలు మానుకుని ఉమ్మడిగా రాజధానికి రావల్సిన నిధులపైన, విభజన చట్టంలోని హామీల అమలుకోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సిపిఐ(ఎం) కోరుతున్నది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నది.

**(పి.మధు)**
రాష్ట్ర కార్యదర్శి